# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 25-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- లక్ష్య సాధనలో ప్రపంచానికి భారత్ మార్గదర్శకంగా నిలుస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.
- రక్షణ ఉత్పత్తుల తయారీ, వాణిజ్య రంగాల్లో భారత్, ఇండోనేషియా దేశాలు కలిసి పని చేసేందుకు ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు.
- భారతదేశ ప్రతిష్టాత్మకమైన పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ఈరోజు ప్రకటించింది.
- జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

=============================

లక్ష్య సాధనలో ప్రపంచానికి భారత్ మార్గదర్శకంగా నిలుస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ఈరోజు ప్రసంగించారు. "ఈ గణతంత్ర దినోత్సవం మనకు మరింత ప్రత్యేకమైంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుందని అన్నారు. భరతమాత విముక్తి కోసం త్యాగాలు చేసిన వారితో పాటు.. వెలుగులోకి రాని మరికొందరు ధైర్యవంతులను స్మరించుకోవాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలు రూపొందించి అమల్లోకి తీసుకువస్తున్నామని రాష్ట్రపతి తెలుపుతూ…

(వాయిస్ 31 సెకన్లు)

=============================

భారత్ - ఇండోనేషియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఈరోజు ఢిల్లీలో ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవో సుబియాంటోతో ప్రధానమంత్రి సమావేశమయ్యారు. అనంతరం నరేంద్రమోదీ మాట్లాడుతూ… భారత్, ఇండోనేషియా దేశాలు పలు ఒప్పందాలు చేసుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా రక్షణ ఉత్పత్తుల తయారీ, వాణిజ్య రంగాల్లో భారత్, ఇండోనేషియా కలిసి పని చేయబోతున్నాయని వెల్లడిస్తూ….

(వాయిస్ 37 సెకన్లు)

భారత్ తో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు ఇండోనేషియా కూడా సిద్ధంగా ఉందని ఆ దేశ అధ్యక్షులు సుబియాంటో అన్నారు. కాగా మూడు రోజుల భారత్ పర్యటనకు వచ్చిన సుబియాంటో రేపు దిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

==============================

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర హోంశాఖ పోలీసు పతకాలను ప్రకటించింది. పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, పౌర భద్రత తదితర విభాగాలకు చెందిన 942 మంది సిబ్బందికి శౌర్య, సేవ పురస్కారాలను అందజేయనుంది. ఈమేరకు అవార్డుల జాబితాను ఈరోజు విడుదల చేసింది. ఇందులో 95 మంది సైనికులకు శౌర్య పతకం, 101 మందికి విశిష్ట సేవకు రాష్ట్రపతి పతకం, 746 మందికి ప్రశంసనీయ సేవా పతకాలు లభించాయి.

101 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలలో 85 మందికి పోలీసులకు, 5 అగ్నిమాపక, 7 పౌర రక్షణ - హోంగార్డ్‌లకు, 4 సంస్కరణల విభాగానికి లభించాయి. 746 మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్ఎం) పతకాలలో 634 పోలీసు సేవకు, 37 అగ్నిమాపక సేవకు, 39 సివిల్ డిఫెన్స్-హోం గార్డ్స్‌కు, 36 కరెక్షనల్ సర్వీస్‌కు లభించాయి.

==============================

రేపు ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్ కు దేశ వ్యాప్తంగా 10 వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా మంగళగిరిలో ఎంబీబీఎస్ చదువుతున్న భవానీ శంకర్ ఈ వేడుకకు హాజరుకానున్నట్లు తెలిపారు. పీఎం యశస్వీ స్కాలర్‌షిప్ పొందుతున్న తనకు ఈ మేరకు ఆహ్వానం అందినట్లు వెల్లడించారు.

(వాయిస్ 24 సెకన్లు)

విరామం

==============================

ఈరోజు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం శక్తివంతమైన ప్రజాస్వామ్యానికి గుర్తు అని పేర్కొన్నారు. ఇది ప్రతి పౌరుడికి తన ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశాన్ని కల్పిస్తుందని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్న ప్రధానమంత్రి... దేశ భవిష్యత్‌కు ఇది ఎంతో ప్రాముఖ్యమైనదని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం పని తీరును అభినందించారు. పోలింగ్ ప్రక్రియను ఆధునికీకరించడంతో పాటు ప్రజల శక్తిని బలోపేతం చేసేందుకు ఎన్నికల సంఘం కృషి చేస్తుందని ప్రధానమంత్రి తెలిపారు.

==============================

భారతదేశ ప్రతిష్టాత్మకమైన పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ఈరోజు ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించినవారిని ఈ అవార్డులకు ఎంపిక చేసింది. వివిధ రాష్ట్రాల నుంచి చేతి వృత్తులు, వ్యవసాయం, చేనేత రంగాలతో సహా పలు రంగాలలో సేవలు అందించిన వారితో పాటు ముగ్గురు విదేశీయులు పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు.

==============================

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్లు, ఎన్నికల సంఘం కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు రాష్ట్రపతి పురస్కారాలను అందజేశారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంపై ఓటర్లు విశ్వాసం కలిగి ఉండాలని, వివేకం కలిగిన ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తారని పేర్కొన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, అలాగే వికలాంగులకు, మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన ఓటర్లకు ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కృషి చేసిందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==============================

వీర్ గాథ 4.0 సూపర్-100 విజేతలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కలసి ఈరోజు ఢిల్లీలో సత్కరించారు. వంద మంది విజేతల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 66 మంది బాలికలు ఉన్నారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... విద్య ద్వారా ధైర్యవంతులకు గుర్తింపును అందిస్తున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తెలివితేటలు, ఉత్సాహం, దేశభక్తిని కొనియాడారు. వీర్ గాథా లక్ష్యాన్ని సాధించడంలో రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ప్రయత్నాలను ఆయన అభినందించారు.

(వాయిస్ 34 సెకన్లు)

కాగా రేపు కర్తవ్య పథ్‌లో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌ను చూసే పది వేల మంది ప్రత్యేక అతిథులలో ఈ సూపర్ 100 విజేతలు కూడా ఉన్నారు.

==============================

ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాలో ఈ నెల 29న మౌనీ అమావాస్య నిర్వహణకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజున వీఐపీ జోన్ ఉండదని.. అలాగే వారికి అదనపు ఏర్పాట్లు ఉండవని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ప్రయాగ్‌రాజ్‌లోకి వాహనాలను అనుమతించబోమని, పెద్దఎత్తున తరలివచ్చే ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకొంటున్నట్లు పేర్కొంది. మౌనీ అమావాస్య ఒక్కరోజే దాదాపు 10 కోట్ల మంది భక్తులు అమృత స్నానాలు చేసే అవకాశం ఉన్నందున 12 కిలోమీటర్ల పొడవైన ప్రత్యేక ఘాట్‌ను సిద్ధం చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

==============================

==============================